ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు

ఆదివారం 21 ఏప్రిల్ 2024

కంకర విషయంలో ఘర్షణ

- సింగర్ బొగడ తండాలో కర్రలు, రాళ్లతో యువకుడిపై దాడి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- మృతుడు బీఆర్ఎస్ కార్యకర్త
- తండాలో పోలీస్ పికెటింగ్



శ్రీనివాస్ (ఫైల్)

7లో

మూడోరోజు.. నామినేషన్ల జోరు

సంగారెడ్డి టౌన్/మెదక్ అర్బన్, ఏప్రిల్ 20: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మూడోరోజు జహీరాబాద్, మెదక్ నియోజకవర్గాలకు 14 నామినేషన్లు దాఖలయ్యాయి. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి శనివారం 5 నామినేషన్లు దాఖలయ్యాయి. సంగారెడ్డి కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి క్రాంతికి అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను అందజేశారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా గాలి అనీల్‌కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, అందోలు మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా ప్రవీణ్, రామారావుపాటిల్, మారుతీరావుతో పాటు టీపీఎస్ అభ్యర్థి కొత్తబలిజ బస్వరాజ్ నామినేషన్లు దాఖలు చేశారు. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి ఇప్పటివరకు 9 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.



సంగారెడ్డిలో నామినేషన్ పత్రాలను అందజేస్తున్న అనిల్‌కుమార్

మెదక్‌కు 9 నామినేషన్లు

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గానికి శనివారం తొమ్మిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్టు మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా అన్నెల లక్ష్మణ్, స్వతంత్ర అభ్యర్థులుగా గౌటి మల్లేశ్, దుబాల శ్రీశైలం, కే. సత్యనారాయణగౌడ్, చిక్కులపల్లి నవీన్, ఏ. నాగమణి, కొట్యూకర్ ప్రతాప్, గొంది భుజంగం, బండపల్లి శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 17 నామినేషన్లు దాఖలైనట్లు ఆయన వెల్లడించారు.

పాతికేళ్ల కిందటే ఇందిరమ్మ గెలిచిన నియోజకవర్గం మెదక్

- కసితో పనిచేసి మరోసారి కాంగ్రెస్‌ను గెలిపించుకుందాం
- మెదక్ సభలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి





కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా మెదక్‌లో జరిగిన సభలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి

సిద్దిపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధినేత్రి దివంగత ఇందిరాగాంధీ 25 ఏళ్ల కిందట గెలిచిన పార్లమెంట్ నియోజకవర్గం మెదక్ అని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి పేర్కొన్నారు. మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నామినేషన్ సందర్భంగా శనివారం మెదక్‌లో భారీ ర్యాలీ, సభ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక ప్రాధాన్యమున్న మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకునేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కసితో పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ తరఫున మెదక్ అభ్యర్థిగా బరిలోఉన్న నీలం మధును భారీ మెజారిటీతో గెలిపించి రాహుల్‌గాంధీకి గిఫ్ట్‌గా ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. పాతికేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీకి అడ్డాగా ఉన్న ఈ నియోజకవర్గంలో మళ్లీ మూడురంగుల జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇది ఇందిరాగాంధీ విజయం సాధించిన గడ్డ అని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీకి కసితో ఓట్లువేయించాలని ఆయన కోరారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సిద్దిపేట నుంచి సంగారెడ్డి వరకు ఓట్లు దంచుడే దంచాలంటూ ఆయన కార్యకర్తల్లో జోష్ నింపారు. బీజేపీ, బీఆర్ఎస్ అడ్డొచ్చినా ఆగేది లేదన్నారు. అసలు ఆ రెండు పార్టీల గురించి పట్టించుకోవద్దని కార్యకర్తలను కోరారు. హుషారుగా ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును ఎంపీగా గెలిపించాలని కోరారు. మెదక్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే దేశంలో రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని జగ్గారెడ్డి అన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షోలో జనసంద్రం



నీలం మధును గెలిపించాలని కోరుతున్న రేవంత్‌రెడ్డి

మెదక్ అభివృద్ధి ఇందిరమ్మ పాలనలోనే..

పాతికేళ్లలో బీజేపీ, బీఆర్ఎస్‌లు చేసిందేమీ లేదు

రైతులను ముంచిన దుర్మార్గుడు వెంకట్రాంరెడ్డి

- నీలం మధు గెలుపు ఖాయం
- కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్ రెడ్డి

మెదక్, ఏప్రిల్ 20 : ఇందిరాగాంధీ ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన సమయంలోనే మెదక్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మెదక్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా జిల్లాకేంద్రంలో శనివారం ఆయన రోడ్‌షో నిర్వహించారు. అనంతరం కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమం సీఎం రాక ఆలస్యం కావడంతో మధ్యాహ్నం రెండు గంటలకు మొదలయ్యింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ కష్టాల్లో ఉన్నప్పుడు మెదక్ ప్రజలు ఆదరించి ఇందిరమ్మను భారీ మెజారిటీతో ఎంపీగా గెలిపించారని గుర్తుచేశారు. మెదక్ జిల్లాను ఇందిర ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. బీహెచ్‌ఈఎల్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, బీడీఎల్, ఇక్రిశాట్ తదితర భారీ పరిశ్రమలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. పటాన్‌చెరును పారిశ్రామికవాడగా అభివృద్ధి చేశారన్నారు. దీంతో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభించిందని కొనియాడారు. నియోజకవర్గంలో ఇప్పటికీ ఆమె చేసిన అభివృద్ధే కనిపిస్తున్నదన్నారు. ఆ తర్వాత ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలు ఏం చేశారో లెక్కచెప్పాలని ప్రశ్నించారు. పదేళ్లలో మోదీ, కేసీఆర్ మెదక్ ప్రాంతానికి చేసిందేమిటో చూపించాలని ప్రశ్నించారు.

రైతులను లాఠీలతో కొట్టించిన వెంకట్రాంరెడ్డి

బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెంకట్రాంరెడ్డి దుర్మార్గుడని సీఎం పేర్కొన్నారు. మల్లన్న సాగర్ నిర్వాసితులు పరిహారం అడిగితే లాఠీలతో కొట్టించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఎమ్మెల్యేగా దుబ్బాక అభివృద్ధికి చేసిందేమీ లేదని విమర్శించారు. బీసీలు, ముదిరాజ్‌లు ఏకమై నీలం మధును భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

17 స్థానాల్లోనూ గెలుస్తాం

రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలనూ కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని మంత్రి దామోదర్ రాజనర్సింహ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రోజు రోజుకూ బీజేపీ గ్రాఫ్ పడిపోతోందని అన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయితే ప్రతీ సంవత్సరం 30 లక్షల ఉద్యోగాలు ఇస్తారని తెలిపారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెంకట్రాంరెడ్డి అవినీతిపరుడని విమర్శించారు. రైతులను, నిరుపేదలను ఇబ్బందిపెట్టిన ఆయన నీలం మధుకు సరితూగడని పేర్కొన్నారు.



అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఎండ మండుతున్నా.. బ్రహ్మరథం

మెదక్ అర్బన్ : డప్పుచప్పుళ్లు, అభిమానుల కోలాహలం మధ్య మెదక్ సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షో ఉత్సాహంగా సాగింది. హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో వచ్చిన సీఎం స్థానిక సీఎస్ఐ మైదానంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో దిగారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన అనంతరం తొలిసారిగా మెదక్‌కు రాగా, ఆయనకు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రచార రథంపై ఎక్కిన రేవంత్‌రెడ్డి కిలోమీటర్ల కొద్ది రోడ్డుకు ఇరువైపులా బారులు తీరిన జనానికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ధ్యాన్‌చంద్ చౌరస్తా వద్ద ప్రారంభమైన రోడ్‌షో 33 నిమిషాలపాటు సాగి, చివరికి రాందాస్ చౌరస్తాకు చేరుకున్నది.



ర్యాలీలో బైక్‌పై మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



రోడ్‌షోలో చిందేస్తున్న కాంగ్రెస్ మహిళా కార్యకర్త

గెలిపిస్తే అభివృద్ధి చేస్తా : నీలం మధు

తనకు ఓటేసి గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని, మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు పేర్కొన్నారు. వెనుకబడిన కులానికి చెందిన తనపై నమ్మకం ఉంచి టికెట్ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, మదన్‌రెడ్డి, నర్సారెడ్డి, నాయకులు ఆవుల రాజిరెడ్డి, కాట శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, పూజల హరికృష్ణ, ఆంజనేయులుగౌడ్, కొండన్ సురేందర్‌గౌడ్, జీవన్‌రావు, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి అందోల్ మున్సిపల్ చైర్మన్

- మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి కూడా..
- మంత్రి దామోదర్ సమక్షంలో చేరిక

జోగిపేట, ఏప్రిల్ 20: పార్లమెంట్ ఎన్నికల వేళ.. అందోలు నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌కు అత్యంత ఆప్తుడిగా మెలిగిన రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్యతో పాటు వివిధ మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. సంగారెడ్డిలోని మంత్రి దామోదర్ నివాసంలో శనివారం సాయంత్రం వారంతా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.



మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న రాయికోడ్ మండల నాయకులు

కాంగెస్‌లో చేరింది వీరే..

మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, వైస్ చైర్మన్ మేతరి ప్రవీణ్(డేవిడ్), కౌన్సిలర్ పడిగె సుమిత్ర సత్యం, రాయికోడ్ జడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్, బీఆర్ఎస్ రాయికోడ్ మండలాధ్యక్షుడు బస్వరాజ్ పాటిల్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్ధన్నపాటిల్, రాయికోడ్ మండలం మల్లంపల్లి ఎంపీటీసీ సత్యమ్మశ్రీశైలంతో పాటు సుమారు 300 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కాగా, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య ఐదేళ్లలో మాజీ ఎమ్మెల్యేకు అత్యంత ఆప్తులుగా పేరుగాంచారు. గతంలోనే గూడెం మల్లయ్య కాంగ్రెస్‌లో చేరతారని పుకార్లు వెలువడినా 'ఆయన నాకు అత్యంత ఆప్తుడని, బీఆర్ఎస్‌ను వీడే ఛాన్స్ లేదంటూ క్రాంతికిరణ్ కొట్టిపారేయడం గమనార్హం.

రాయికోడ్ బీఆర్ఎస్ నాయకులూ..

రాయికోడ్ : మండల పరిధిలో ఆయా గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్, నాయకులు, కార్యకర్తలు శనివారం సంగారెడ్డిలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్దన్నపాటిల్, జిల్లా జడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు మల్లిఖార్జున్‌పాటిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బస్వరాజుపాటిల్ తదితరులు పార్టీలో చేరినవారిలో ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్‌కుమార్ షెట్కార్, శంకర్, ఎంపీపీ అధ్యక్షుడు మొగులప్ప, మాజీజడ్పీటీసీ సుభాష్ పాటిల్ పాల్గొన్నారు.



అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ డేవిడ్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్న మంత్రి దామోదర్

సంగారెడ్డి ఆసుపత్రిలో ఫ్యాన్ల ఏర్పాటు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 20 : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఫ్యాన్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. సంగారెడ్డి దవాఖానాలో ఫ్యాన్లు లేక రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఈ నెల 20న ఆంధ్రజ్యోతిలో 'సర్కారు ఆసుపత్రికి ఇంటి నుంచి ఫ్యాన్లు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై జిల్లా కలెక్టర్ క్రాంతి స్పందించారు. ఆసుపత్రిలో ఉక్కపోతతో ఎవరూ ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.అనీల్‌కుమార్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలమేరకు ఆయన ఆసుపత్రిలో కొత్త ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. పాడైన ఫ్యాన్లను రిపేర్ చేయించి వినియోగంలోకి తీసుకువచ్చారు.



సంగారెడ్డిలోని ఎంసీహెచ్‌లో ఫ్యాన్లు బిగిస్తున్న సిబ్బంది

క్షయ మందుల కొరతపై కలెక్టర్ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 20 : సంగారెడ్డి జిల్లాలో క్షయ మందుల కొరత నెలకొనడంపై కలెక్టర్ క్రాంతి ఆరా తీశారు. మందులు 'క్షయ'ం అనే శీర్షికన ఈ నెల 20న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆమె స్పందించారు. జిల్లా వైద్యాధికారితో టీబీ మందుల కొరతపై ఆరా తీశారు. క్షయ రోగులకు ఇబ్బందులు కలగకుండా మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. క్షయ నివారణ విభాగం సిబ్బంది క్షేత్రస్థాయిలో సక్రమంగా పనిచేసేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాలతో క్షయ నివారణ విభాగం పరిధిలో పనిచేసే సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్లను అప్రమత్తం చేశామని, టీబీ బాధితులకు సకాలంలో మందులు అందజేసి, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించినట్టు జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రాజేశ్వరి ప్రకటనలో తెలిపారు.

టీచర్ల డిప్యూటేషన్లు, వర్క్ ఆర్డర్లు రద్దు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 20 : సంగారెడ్డి జిల్లాలో టీచర్ల డిప్యూటేషన్లు, వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ఆర్డర్లను రద్దు చేస్తూ డీఈవో వెంకటేశ్వర్లు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఈ విద్యా సంవత్సరం సుమారు 180 మంది టీచర్లు డిప్యూటేషన్, వర్క్ ఆర్డర్లపై పనిచేస్తూ వస్తున్నారు. విద్యా సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో వారి ఆర్డర్లు రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు వెలువరించారు. పాఠశాల చివరి పనిదినం ఈ నెల 23న ఒరిజినల్ పోస్టింగ్ ఉన్న స్కూల్‌లో వెళ్లి రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

సమన్వయంతో విధులు నిర్వర్తించాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఆనంద్ కుమార్ రాజ్‌వన్షి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 20 : ఎన్నికల విధుల్లో ఉన్న అన్నివిభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఆనంద్‌కుమార్ రాజ్‌వన్షి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల ఎంసీసీ, ఎన్జీఆర్ఎస్, కంట్రోల్‌రూం, సీ విజిల్, ఎంసీఎంసీ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి పార్టీ ద్వారా అభ్యర్థి తరఫున ఖర్చుచేసే ప్రతీ పైసాను పకడ్బందీగా లెక్కగట్టాలని ఆదేశించారు. అనుమానాస్పద ఖాతాలను తనిఖీ చేయాలని సూచించారు. మీడియా సెంటర్లు, పత్రికలు, టీవీ ఛానళ్లు, సోషల్ మీడియాలో అభ్యర్థుల ప్రకటనలు, ప్రచార ఖర్చు వివరాలను రికార్డు చేయాలని మీడియా సెంటర్ నిర్వాహకులను ఆనంద్‌కుమార్ నిర్దేశించారు. పేయిడ్ న్యూస్‌పై నిఘా పెట్టాలని సూచించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ మాధురి తదితరులు ఉన్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో సీ విజిల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆనంద్ కుమార్ రాజ్‌వన్షి

అకాల వర్షాలతో అన్నదాత కలవరం

నిజాంపేట/అల్లాదుర్గం, ఏప్రిల్ 20: ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి వచ్చిన సమయంలో అకాల వర్షాలు కురుస్తుండంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. నిజాంపేట మండలంలోని పలు గ్రామాల్లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడుస్తున్నది. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచి రైతులను ఆదుకోవాలని పలువురు నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అలాగే గత వడగండ్ల వానతో నష్టపోయిన పంటల వివరాలను సేకరించారని నేటికీ నష్టపరిహారం అందించడం లేదని ప్రభుత్వం ఇపంటికైనా నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కోరారు.



నిజాంపేటలో తడిసిన ధాన్యం

ప్రభుత్వం ఆదుకోవాలి

గాలి, దుమారం, వడగండ్ల వానతో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అల్లాదుర్గం మండల రైతులు కోరుతున్నారు. శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షం అల్లాదుర్గం మండలంలోని పలు గ్రామాల్లో బీభత్సం సృష్టించింది. వరి కోతకు వచ్చిన సమయంలో వడగండ్ల వాన, గాలి దుమారంతో ధాన్యం రాలిపోయింది. మరికొన్ని ప్రాంతాల్లో పంట నేలకొరిగి తీవ్రంగా నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గడిపెద్దాపూర్, మాందాపూర్, తదితర గ్రామాలలో విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో తృటిలో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు.



అల్లాదుర్గంలో నేలరాలిన మామిడి

గ్యాస్ సిలిండర్ పేలి హోటల్ దగ్ధం

టేక్మాల్, ఏప్రిల్ 20: గ్యాస్ సిలిండర్ పేలి హోటల్ దగ్ధమైన సంఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మాట్‌పల్లి గ్రామంలో శనివారం జరిగింది.



బొడ్మాట్‌పల్లిలో దగ్ధమవుతున్న హోటల్

శంకరంపేట మండలం నిజాంపేట గ్రామానికి కన్నబాబు బొడ్మాట్‌పల్లి గ్రామ నేషనల్ హైవే పక్కన గత రెండు సంవత్సరాల నుంచి హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం గ్యాస్ సిలిండర్ లీకై మంటలు ఎగిసిపడంతో హోటల్ దగ్ధమైంది. హోటల్‌లో ఉన్న కస్టమర్లు ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. అందరు చూస్తుండగానే హోటల్ కాలి బూడిదయ్యింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. టేక్మాల్ ఆర్‌ఐ సాయి శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది చేరుకుని పంచనామా నిర్వహించారు. హోటల్‌లో ఉన్న రూ.48వేల నగదుతో పాటు రూ.ఆరు లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు.



నిజాంపేట మండలంలోని రాంరెడ్డిపేట్‌లో నిర్వహించిన కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు



నారాయణఖేడ్‌లో నిర్వహించిన కుస్తీ పోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు వెండికడియంను అందజేస్తున్న నిర్వాహకులు

హోరాహోరీగా కుస్తీ పోటీలు

● తరలి వచ్చిన వివిధ రాష్ట్రాల మల్లయోధులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 20: శ్రీరామ నవమి ఉత్సవాలను పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో శనివారం నిర్వహించిన కుస్తీపోటీలు హోరాహోరీగా కొనసాగాయి. కరకరలాడే నల్లరేగడి మట్టి నేలలో భగభగ మండే ఎండను సైతం లెక్కచేయకుండా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మల్లయోధులు కుస్తీలో తలపడ్డారు. పోటీలను తిలకించేందుకు జనాలు సైతం భారీగా తరలి వచ్చారు. స్థానిక రామాలయం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం నిర్వహించిన కుస్తీపోటీల్లో కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలతో పాటు ఖేడ్ ప్రాంతంలోని వివిధప్రాంతాలకు చెందిన వందలాది మంది మల్లయోధులు పాల్గొన్నారు. నిర్వాహకులు పహిల్వాన్‌ల స్థాయిని బట్టి రూ.10 నుంచి రూ.500ల వరకు నగదుతోపాటు వెండి కడియాలను బహూకరించారు. చిట్టచివరి పోటీల్లో గెలుపొందిన వారికి ఐదు తులాల వెండి కడియడంతో పాటు రెండవ బహుమతిగా మూడు తులాల కడియంను, మూడవ బహుమతిగా రెండు తులాల కడియంను అందించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ప్రత్యేకంగా నాందేడ్, ఉద్గీర్, లాథూర్, ఔరాత్, బీదర్, డెగ్లూర్ ప్రాంతాలకు చెందిన పహిల్వాన్‌లు నారాయణఖేడ్‌కు వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వివేకానంద్, ఆలయ కమిటీ బాధ్యులు పాండు, నిర్వాహకులు సాయిలుపటేల్, కన్నయ్యలాల్, సంజీవ్, భరత్‌సేత్, మదన్‌లాల్ పాల్గొన్నారు.

నిజాంపేట మండలం రాంరెడ్డిపేట్‌లో

కల్హేర్: నిజాంపేట మండల పరిధిలోని రాంరెడ్డిపేట్‌లో శ్రీరామ నవమి సందర్భంగా శనివారం నిర్వహించిన కుస్తీ పోటీలు అలరించాయి. సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన మల్లయోధులే కాకుండా సరిహద్దున ఉన్న కర్నాటక, మహారాష్ట్రలకు చెందిన మల్లయోధులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేయగా, ఫైనల్ విజేతకు అయిదు తులాల వెండి కడియం అందజేశారు. ఈ ఉత్సవంలో రాంరెడ్డిపేట్ ఎంపీటీసీ మన్నె క్రిష్ణ, నాయకులు భూమేష్, జనార్ధన్‌రెడ్డి, సాయిలు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమాలకు సీఐటీయూ మద్దతు

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 20: సామాజిక ఉద్యమాలకు సీఐటీయూ మద్దతు తెలుపుతూ ప్రత్యక్ష పోరాటాల్లో భాగస్వామి అవుతుందని సీఐటీయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మల్లేశం తెలిపారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శనివారం సీఐటీయూ జిల్లా కమిటీకి వివిధ పరిశ్రమల కార్మికులు సేకరించిన సామాజిక ఉద్యమాల నిధి చెక్కును కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో సామాజిక వారోత్సవాల్లో భాగంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్మికుల నుంచి నిధి సేకరించామన్నారు. సామాజిక ఉద్యమాలను బలపరుస్తూ సంఘీభావ నిధి రూ.70 వేలు అందించిన కార్మికులు అభినందనీయులన్నారు. కేంద్రంలని బీజేపీ ప్రభుత్వం దళిత, గిరిజన, మైనార్టీల సమస్యలను పరిష్కరించకుండా వారిని ఓటు బ్యాంకుగా మాత్రమే వినియోగించుకుంటుందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తమ ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. సామాజిక ఉద్యమాలకు సీఐటీయూ సంఘీభావంగా అన్ని రకాలుగా తోడ్పాటునందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, నాయకులు రాజయ్య, యాదగిరి, ప్రవీణ్, మహిపాల్, విద్యాసాగర్, సురేష్, నాగేశ్వర్‌రావు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు న్యాయం చేయాలి

- అమీన్‌పూర్ పెద్దచెరువు చెరువు తూములు, కాల్వలను పునరుద్ధరించి నీటిని వదలాలి
- మురికి నీరు చేరకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి
- ప్లాట్ల ముంపు బాధితుల డిమాండ్, నిరసన

పటాన్‌చెరు, ఏప్రిల్ 20: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పెద్దచెరువు తూములు, కాల్వలను పునరుద్ధరించి నీటిని వదిలి, న్యాయం చేయాలని ప్లాట్ల యజమానులు డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పెద్ద చెరువులో ఏడాది పొడవునా మురికి నీరు వచ్చి చేరుతుండడంతో వేలాది ప్లాట్లు నీట మునిగి ఇండ్లు నిర్మించుకునే పరిస్థితి లేకుండా పోయిందంటూ బాధితులు శనివారం చెరువు కట్టపై ఉన్న సాయిబాబా ఆలయం వద్ద ఆందోళనకు దిగారు. ప్లకార్డులను చేతబూని నినాదాలు చేశారు. వర్షాకాలంలో వరద నీటితో నిండిన చెరువులోంచి తూములు, మత్తడి ద్వారా గొలుసుకట్టు చెరువుల్లోకి, కుంటల్లోకి నీటిని దిగువకు వదలాల్సి ఉండగా కొందరు అధికారులు చేస్తున్న తప్పిదంతో చెరువు ముంపు విస్తీర్ణం పెరిగిపోయిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని వింత పరిస్థితి ఇక్కడ నెలకొందన్నారు. చెరువు పైభాగంలోని పట్టాభూముల్లో వేసిన హుడా, పంచాయతీ లేఔట్‌లలో సేల్ డీడ్‌ల ద్వారా కొన్న వేలాది ప్లాట్లు చెరువులో మునిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లుగా చెరువు నీటిని దిగువకు వదలకపోవడంతో పాటు వందలాది కాలనీల నుంచి మురికి నీరు నిరంతరం వాహిణిలా చెరువులోకి వచ్చి చేరుతున్నదని చెప్పారు. వర్షాలతో పనిలేకుండా మండు వేసవిలో సైతం మురికి నీరుతో చెరువు నిండిపోయిందన్నారు. కంపు కొడుతున్న నీటిలో పెంచే చేపలు తిని ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నదని ఆరోపించారు. 93.5 ఎకరాలు మాత్రమే ఉండాల్సిన చెరువు విస్తీర్ణం నీటిని వదలకపోవడం ద్వారా 465ఎకరాలు ఉన్నదని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు. తక్షణం చెరువు తూములు, కాల్వలను పునరుద్ధరించి నీటిని వదలాలని డిమాండ్ చేశారు. మురికి నీరు వచ్చి చేరకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. ముంపు బాధితులకు న్యాయం జరిగేలా నీటి మట్టాన్ని సవరించి ఇండ్ల నిర్మాణాలకు అనుమతులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన అనంతరం అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బాధితుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం జరిగేలా కృషి చేస్తానని కమిషన్ హామీ ఇచ్చారు. ఆందోళనలో పెద్దచెరువు ముంపు బాధితుల సంఘం జేఏసీ చైర్మన్ చిరునామా సత్యనారాయణ, నాయకులు బ్రహ్మానందరావు, వెంకటప్పయ్య, రాంబాబు, శేషసాయి, వాసు, పంపత్, జీవా, సుధాకర్, రాధాక్రిష్ణ, టీవీ.రావు, ఎస్‌వీకే.రాజు తదితరులు పాల్గొన్నారు.


అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం


పెద్దచెరువు కట్టపై ఆందోళన చేస్తున్న ప్లాట్ల ముంపు బాధితులు

కంకర విషయంలో ఘర్షణ

- సింగర్‌బొగడతండాలో కర్రలు, రాళ్లతో యువకుడిపై దాడి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి ● మృతుడు బీఆర్ఎస్ కార్యకర్త

కల్హేర్, ఏప్రిల్ 20: గ్రామంలో కంకర విషయంలో తలెత్తిన ఘర్షణ ఓ యువకుడి ప్రాణాలు తీసింది. పెద్దల సమక్షంలో పంచాయతీ జరుగుతుండగానే.. ఓ వర్గానికి చెందిన వారు మరో వర్గంపై దాడిచేయడంతో తీవ్రంగా గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్త ఆస్పత్రిలో మృతి చెందాడు. దీంతో ఈ సంఘటన రాజకీయ రంగును పులుముకుంది. దాడి చేసిన వారు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కాగా, మరణించిన యువకుడు బీఆర్ఎస్‌కు చెందిన వ్యక్తి కావడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం సింగర్‌బొగడ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు రాజ్యానాయక్, అతని కుటుంబసభ్యులు తండాలో ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద సీసీరోడ్డును నిర్మించారు. పనులు పూర్తయిన తర్వాత కొంత కంకర మిగలడంతో దానిని వారి సమీప బంధువుకు విక్రయించారు. వారు కంకర తీసుకువెళ్లే విషయంలో ఇరువర్గాల మధ్య శుక్రవారం ఘర్షణ చోటు చేసుకుంది. ఈ విషయమై శనివారం పంచాయితీ నిర్వహించారు. పెద్దల సమక్షంలో పంచాయితీ జరుగుతుండగానే కాంగ్రెస్ నాయకుడు రాజ్యానాయక్, అతని కుటుంబసభ్యులు బీఆర్ఎస్‌కు చెందిన శ్రీనివాస్, అతడి కుటుంబ సభ్యులపై కర్రలు, రాళ్లతో దాడి చేశారు. శ్రీనివాస్ తీవ్రంగా గాయపడగా నారాయణఖేడ్.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. శ్రీనివాస్ సోదరుడు జాదవ్ రవి తలకు కూడా తీవ్ర గాయమైంది. విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి సంగారెడ్డికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, సిర్గాపూర్ ఎస్ఐ మహిపాల్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. తండాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పికెటింగ్ ఏర్పాటు చేశారు. సిర్గాపూర్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న సింగర్‌బొగడతండాలో పెద్దఎత్తున దాడులు, ప్రతి దాడులు జరుగుతున్నా సకాలంలో పోలీసులు స్పందించడం లేదని తండావాసులు ఆరోపించారు. నిందితులు పరారీలో ఉన్నారు.

సూపర్ మర్కుక్ పోలీస్...

- పాఠశాలకు వెళ్లిన బాలుడి కిడ్నాప్
- రూ.15 లక్షలు ఇవ్వాలని కిడ్నాపర్ డిమాండ్
- మూడు గంటల్లోనే బాలుడ్ని కాపాడిన పోలీసులు
- బిహార్‌కు చెందిన ముగ్గురు కిడ్నాపర్ల అరెస్టు


వివరాలను వెల్లడిస్తున్న సీపీ అనురాధ

మర్కుక్, ఏప్రిల్ 20: బాలుడ్ని కిడ్నాప్ చేసి, రూ.15లక్షలు డిమాండ్ చేసిన ముగ్గురిని పోలీసులు మూడు గంటల్లోపే అరెస్టు చేసి, బాలుడ్ని రక్షించారు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం కరకపట్ల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. సిద్దిపేట సీపీ అనురాధ, మర్కుక్ ఎస్ఐ మధుకర్‌రెడ్డి శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన తంబ్రిజ్ అలాం కరకపట్ల గ్రామంలోని ఆస్విరో ఫార్మాలో గత 8 సంవత్సరాలు పనిచేస్తూ.. భార్య, ముగ్గురు పిల్లలతో ఆ గ్రామంలోనే నివాసముంటున్నాడు. పెద్ద కొడుకు తావీద్ అలాం(7) అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం పాఠశాలకు వెళ్లిన తావీద్ ఇంటికి తిరిగి రాలేదు. తండ్రి తంబ్రిజ్ కొడుకు స్నేహితులను అడుగగా గుర్తు తెలియని వ్యక్తి తావీద్‌కు చెప్పులు కొనిస్తానని వెంట తీసుకెళ్లినట్లు చెప్పారు. వెంటనే తంబ్రిజ్ అలాం మర్కుక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ మధుకర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని సీసీ కెమెరాలను పరిశీలించగా తావీద్‌ను భుజంపై చేయి వేసి, నడిపించుకుంటూ ఓ వ్యక్తి తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఇంతలోనే ఓ నంబర్ నుంచి తంబ్రిజ్‌కు ఫోన్ వచ్చింది. మీ అబ్బాయి కిడ్నాప్ అయ్యాడని, రూ.15 లక్షలు ఇస్తేనే విడిపిస్తామని నిందితులు డిమాండ్ చేశారు. ఆ నంబర్ లొకేషన్ ఆధారంగా మర్కుక్ పోలీస్‌స్టేషన్ నుంచి ఒక టీం, గజ్వేల్ రూరల్ సీఐ నుంచి ఒక టీంగా ఏర్పడి హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి కిడ్నాపర్లను శుక్రవారం సాయంత్ర సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పట్టుకున్నారు. కరకపట్ల గ్రామంలోనే తంబ్రిజ్‌తో పాటే నివసించే బీహార్‌కు చెందిన అనూప్ చౌదరి, చందన్‌కుమార్, మేఘనాథ్ కర్మాకర్ ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బాలుడ్ని తల్లిదండ్రులకు అప్పగించారు. 3 గంటల్లోనే బాలుడ్ని రక్షించిన గజ్వేల్ సీఐ మహేందర్‌రెడ్డి, మర్కుక్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, ఎస్ఐ మధుకర్‌రెడ్డిని సిద్దిపేట సీపీ అనురాధ అభినందించారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితుల అరెస్టు

- ఆరున్నర తులాల బంగారం, రూ.27వేల నగదు, ఫోన్లు స్వాధీనం

గజ్వేల్, ఏప్రిల్ 20: రాత్రి సమయంలో ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని సిద్దిపేట జిల్లా గజ్వేల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట సీపీ బి.అనురాధ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 13న గజ్వేల్ పట్టణం హౌజింగ్ బోర్డులోని ఇంటి వెనుక తలుపును పగులగొట్టి లోనికి చొరబడి బంగారు నగలు, రూ.2,7000 నగదు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు ఆ ఇంటి యజమాని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ములకలపల్లి వెంకన్న గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి పర్యవేక్షణలో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు, సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన షరీఫ్(49), తవాబ్(37) గత కొంతకాలంగా గజ్వేల్ పట్టణంలోని లక్ష్మిప్రసన్ననగర్‌లో ఉంటూ పీవోపీ వర్క్ చేస్తున్నారు. జల్సాలకు అలవాటు పడిన వారికి పీవోపీ వర్క్‌తో వచ్చే డబ్బు సరిపోక చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో గజ్వేల్ పట్టణంలోని ఆఫీసర్స్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీలలో రెక్కి చేసి తాళం వేసి ఉన్న ఇళ్లలో రాత్రి పూట దొంగతనాలు చేశారు. శనివారం వారిని అరెస్టు చేసి, ఆరున్నర తులాల బంగారం, రూ.27వేల నగదు, రెండు ఫోన్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని సీపీ అభినందించి, రివార్డును అందజేశారు.

జల్సాలకు అలావాటుపడి మేకల దొంగతనం

- ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు ● రూ.72 వేల నగదు స్వాధీనం



తొగుట పోలీసుస్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ లతీఫ్

తొగుట, ఏప్రిల్ 20: మేకల దొంగతనానికి పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట జిల్లా తొగుట సీఐ లతీఫ్ తెలిపారు. శనివారం తొగుట పోలీసుస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణానికి చెందిన మహమ్మద్ నసీరొదీన్(33), మహమ్మద్ షాదుల్(24), మజీద్‌పల్లి సురేష్(24) ముగ్గురు జల్సాలకు అలవాటు పడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని భావించారు. అందుకోసం గ్రామాల శివారులో ఉన్న గొర్రెల షెడ్లలో ఉన్న గొర్రెలను, మేకలను దొంగలించి అమ్ముకోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఓ కారు తీసుకుని రెండు నెలలుగా మెదక్ జిల్లా శివంపేట మండలం గూడూర్ గ్రామంలో ఒక గొర్రె పొటేల్, నాలుగు గొర్రెలు, కొండపాక మండలం మర్పడగ గ్రామ శివారులో రెండు మేకలు, సిద్దిపేట మండలం తడ్కపల్లి శివారులో మూడు మేకలు, తొగుట మండలం రాంపూర్‌లో రెండు మేకలు, దౌల్తాబాద్ మండలం ముబారస్‌పూర్ గ్రామంలో రెండు మేకలను దొంగిలించారు. వాటిని తూప్రాన్ పట్టణానికి చెందిన వాన్కర్ శ్రీనివాస్(29), అరికెల మల్లేశం(23)లకు అప్పగించగా వారు వాటిని మార్కెట్‌లో అమ్మి వచ్చిన డబ్బులను కలిసి పంచుకునేవారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున 4 గంటలకు చందాపూర్ గ్రామ శివారులో తొగుట ఎస్ఐ లింగం తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తుండగా కారులో అటువైపు వెళ్లిన నిందితులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని పట్టుకుని విచారించగా మేకల దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారని సీఐ వెల్లడించారు. దొంగించిన మేకలను అమ్మగా వచ్చిన రూ.72 వేలను స్వాధీనం చేసుకుని, మహమ్మద్ నసీరొదీన్, మహమ్మద్ షాదుల్, మజీద్‌పల్లి సురేష్‌లను రిమాండ్‌కు తరలించామని చెప్పారు. వాన్కర్ శ్రీనివాస్, అరికెల మల్లేశం పరారీలో ఉన్నారని తెలిపారు.

అబద్ధాలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్

- పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం తప్పదు
- బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



సంగారెడ్డిలోని కలెక్టరేట్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 20: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని బాన్సువాడ ఎమ్మెల్యే, అసెంబ్లీ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జహీరాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ శనివారం సంగారెడ్డిలో నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమానికి మాజీ స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ హాజరయ్యారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జహీరాబాద్ లోక్‌సభలో బీఆర్ఎస్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుస్తాడని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఆలోచించి ప్రజల పక్షాన నిలిచే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. రాష్ట్రాలు అన్ని రకాలుగా అభివృద్ధి సాధించాలంటే ప్రాంతీయ పార్టీల ప్రాతినిధ్యం ఎంతో అవసరమన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, అభివృద్ధిపై మాజీ సీఎం కేసీఆర్‌కు పూర్తి అవగాహన ఉన్నదని చెప్పారు. అమలుకు సాధ్యం కానీ హమీలతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోయామని గుర్తించిన ప్రజల నుంచి కేవలం నాలుగు నెలల్లోనే వ్యతిరేకత వచ్చిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హమీలను అమలు చేయకుండా గాలికి వదిలేసిన సీఎం రేవంత్‌రెడ్డికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్రంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు ఒరగబెట్టిందేమి లేదని శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు.

మెదక్‌లో రథోత్సవం

- అష్టోత్తర శతఘటాభిషేకంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు


రథంపై శ్రీ ఊరేగుతున్న శ్రీ సీతారామచంద్ర స్వామి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 20: మెదక్ జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయంలో సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఐదు రోజులపాటు వేడుకలు వైభవంగా జరిగాయి. చివరి రోజు శనివారం ప్రధాన అర్చకుడు భాష్యం మధుసూదన్‌చారి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అష్టోత్తర శతఘటాభిషేకం ఘనంగా నిర్వహించారు. అలంకరించిన ఘటాలను మహిళలు నెత్తిన పెట్టుకొని ఊరేగింపు చేపట్టారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, 108 కలాశాల జలంతో పూజలు నిర్వహించారు. శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి వారి దివ్య రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మేళాతాళాలు, తీన్‌మార్ డప్పులు, బాణసంచా వెలుగుల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఊరేగించారు. రథాన్ని లాగేందుకు భక్తులు, యువకులు పోటీ పడ్డారు. ఈ ఉత్సవాల్లో ఆలయ కమిటీ చైర్మన్ బండ నరేందర్, సభ్యులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం మహాదాశీర్వచనం, పండిత సన్మానంతో వార్షిక బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు.

మత్తు పదార్థాలను ఉక్కుపాదంతో అణిచివేయాలి

- సిద్దిపేట సీపీ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 20: సిద్దిపేట జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సిద్దిపేట జిల్లా పోలీసు అధికారులకు సీపీ బి.అనురాధ సూచించారు. శనివారం ఆమె పోలీస్ అధికారులతో కమిషనర్ కార్యాలయంలో పెండింగ్ కేసులపై, ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి ఏసీపీ, సీఐలను, ఎస్ఐలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను ఉక్కుపాదంతో అణిచివేయాలని సూచించారు. పేకాట, జూదం తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాల్లో ఫ్రీజ్ అయిన డబ్బులను త్వరగా బాధితులకు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. బార్డర్ చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా సిద్దిపేట పట్టణంలో ఈ నెల 17వ తేదీన ఒక వ్యక్తి బావిలో పడి మృతిచెందగా టూ టౌన్ ఏఎస్ఐ ఉమారెడ్డి ధైర్య సాహసాలతో బావిలో గాలించి, మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ మేరకు ఆయనను సీపీ సన్మానించి, నగదు రివార్డు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఏసీపీలు మధు, పురుషోత్తంరెడ్డి, సతీష్, శ్రీనివాస్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ గురుస్వామి, సీఐలు, ఎస్ఐలు, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ సమ్మర్ క్యాంపులు షురూ

- ఉచిత శిక్షణకు క్రీడాకారుల ఆసక్తి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 20: క్రికెట్‌పై ఆసక్తిని కనబరుస్తున్న ఔత్సాహికులైన బాలలను ప్రోత్సహించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ), ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవిలో ఉచితంగా క్రికెట్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా సంగారెడ్డిలోని ఎం.ఎస్. క్రికెట్ అకాడమీలో శనివారం వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. నెల రోజుల పాటు (మే 20వరకు) ఈ శిబిరాలు కొనసాగనున్నాయి. ఇందులో అండర్-14, 16, 19, ఓపెన్ కేటగిరీలో శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతిభ కనబర్చిన వారిని అంతర్ జిల్లా టీ-20 టోర్నమెంట్‌కు ఎంపిక చేయనున్నారు. గజ్వేల్‌లో వేసవి శిబిరాన్ని 21న, మెదక్, జహీరాబాద్‌లలో 25న ప్రారంభించనున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి తెలిపారు. గజ్వేల్, జహీరాబాద్‌లలో ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆఫ్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. గజ్వేల్‌లో పేర్ల నమోదుకు 7780596892, జహీరాబాద్‌లో 9866350459 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మధుమోహన్‌రెడ్డి, కోచ్ శ్రీనాథ్‌రెడ్డి, చంద్రమౌళి, ఇనామ్, తౌహిబ్, సభ్యులు అంజద్, జితేందర్‌రెడ్డి, ఎంఎస్ అకాడమీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, అంబేడ్కర్ ఒకేషనల్ కళాశాల చైర్మన్ ధారాసింగ్ పాల్గొన్నారు.

నకిలీ పత్రాలు, ఓనర్‌ను సృష్టించి

రూ.కోట్ల విలువైన ప్లాట్‌ను కాజేందుకు స్కెచ్

- నలుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 20: నకిలీ డాక్యుమెంట్లు, నకిలీ ఓనర్‌ను సృష్టించి కోట్ల రూపాయల విలువైన ప్లాట్‌ను కాజేయాలని చూసిన నలుగురు నిందితులను సంగారెడ్డి జిల్లా సీసీఎస్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకొని న్యాయస్థానం ఎదుట ప్రవేశపెట్టారు. జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న కరపోతుల మహేష్ 2023 జనవరి నెలలో ఎస్‌బి.పరమేశ్ అలియాస్ పరమేశ్వరయ్య వద్ద అమీన్‌పూర్‌లో 120 గజాల ప్లాట్‌ను కొనుగోలు చేశాడు. ఆ ప్లాట్‌ను కాజేయాలని అదే కాలనీలో నివాసముంటున్న తిరుపతి రాథోడ్, దేవేందర్‌రెడ్డి, రవిగౌడ్, దుర్గాప్రసాద్ అలియాస్ అశోక్, సుబ్బారావు పథకం పన్నారు. ఈ మేరకు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారు. అంతేగాక తమకు రూ.20వేలు ఇచ్చి సెటిల్‌మెంట్ చేసుకోవాలని మహేష్‌ను బెదిరించారు. దీంతో మహేష్ 2023 ఆగస్టులో అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. తిరుపతి రాథోడ్ అనే వ్యక్తి పాకాలపాటి జాన్ స్టీవెన్సన్ అనే వ్యక్తి పేరును పరమేశ్వరయ్యగా మార్చి నకిలీ ఆధార్ కార్డును తయారు చేశాడు. పీటీఐ నంబరు, ఇంటి నంబరు, నకిలీ డాక్యుమెంట్ల తయారు చేసి అతడి నుంచి తిరుపతి రాథోడ్ గతేడాది 2023 జూన్ 30న జీపీఏ చేసుకున్నట్టు సృష్టించాడు. పోలీసుల దర్యాప్తులో ఈ విషయాలన్నీ బయట పడటంతో తిరుపతి రాథోడ్, దేవేందర్‌రెడ్డి, రవిగౌడ్, సుబ్బారావులను సీసీఎస్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకొని జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో హాజరుపరిచారు. మరో నిందితుడు దుర్గాప్రసాద్ అలియాస్ అశోక్ పరారీలో ఉన్నాడు.

పోక్సో కేసులో జైలుకు వెళ్లాల్సి వస్తుందని ఆత్మహత్య


సాయిబాబ (ఫైల్)

రాయపోల్, ఏప్రిల్ 20: పోక్సో కేసులో జైలుకు వెళ్లాల్సి వస్తుందన్న భయంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం ముంగీస్‌పల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. బాధిత కుటుంబసభ్యులు, రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ముంగీస్‌పల్లి గ్రామానికి చెందిన సూర్న సాయిబాబా(21) తల్లిదండ్రులకు వ్యవసాయంలో తోడుగా ఉంటున్నాడు. ఏడాది క్రితం అదే గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమించి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బాలిక కుటుంబసభ్యులు గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోక్సో కేసు నమోదై జైలుకు వెళ్లి వచ్చాడు. ఇటీవల వర్గల్ మండలానికి చెందిన బంధువుల బాలికను ప్రేమించాడు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదుతో గౌరారం పోలీస్‌స్టేషన్‌లో సాయిబాబాపై తిరిగి పోక్సో కేసు నమోదైంది. ఈ విషయం తెలుసుకున్న సాయిబాబా మరోసారి జైలుకు వెళ్లాల్సి వస్తుందని భయపడి గురువారం అర్ధరాత్రి ఇంట్లో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు గజ్వేల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి సాయిబాబా మృతిచెందాడు. మృతుడి తండ్రి సూర్న పాపయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 20: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న సుమారు 41 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్, సిద్దిపేట త్రీ టౌన్ పోలీసులు శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేటలోని హరీశ్‌రావునగర్‌కు చెందిన మహమ్మద్ షారుక్ బొలెరో వాహనంలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నాడన్న నమ్మదగిన సమాచారంతో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తెలంగాణ ధర్మకాంట వద్ద టాస్క్‌ఫోర్స్, త్రీ టౌన్ పోలీసులు వెళ్లి పట్టుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మాట్లాడుతూ.. ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేసినా, నిల్వ ఉంచినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అదృశ్యమైన వ్యక్తి.. ఆత్మహత్య


స్వామి (ఫైల్)

రామాయంపేట, ఏప్రిల్ 20: పదిహేను రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు శనివారం రాత్రి గుర్తించారు. మెదక్ జిల్లా రామాయంపేట పట్టణానికి చెందిన పుట్టిచిన స్వామి(48) పదేహను రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అదృశ్యమైన విషయాన్ని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ క్రమంలో శనివారం రాత్రి రామాయంపేట బైపాస్‌కు కొద్ది దూరంలో చెట్టుకు ఉరేసుకుని విగత జీవిగా కనిపించాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అంతర్‌జిల్లా దొంగల ముఠా అరెస్టు

- సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో 38 దొంగతనాలు
- తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలు
- నలుగురు నిందితుల అరెస్టు, పరారీలో ఒకరు
- 40 తులాల బంగారు, 55 తులాల వెండి నగలు, 4 ద్విచక్రవాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 20: సిద్దిపేటలో ఐదుగురు అంతర్‌జిల్లా దొంగల ముఠాను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. సిద్దిపేట సీపీ అనురాధ కమిషనరేట్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. గత మూడు నెలల నుంచి తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకొని సిద్దిపేట జిల్లాలో 30, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 8 మొత్తం 38 దొంగతనాలకు నిందితులు పాల్పడినట్లు సీపీ తెలిపారు. ఫిబ్రవరి 1న కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లె గ్రామానికి చెందిన సున్నపు కర్ణాకర్‌రెడ్డి తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో బంధువుల ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉన్నది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెలతాడు, అరతులం కమ్మలు, రెండున్నర తులాల నెక్లెస్, 10 తులాల వెండి పట్టగొలుసులు, రూ20,000 నగదును చోరీ చేశారు. ఈ మేరకు కర్ణాకర్‌రెడ్డి కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ కేసుతో పాటు జిల్లాలో వరుస దొంగతనాలకు పాల్పడిన దొంగల ముఠాను పట్టుకోవడానికి పోలీసులు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శనివారం రాంపూర్ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సంగారెడ్డి జిల్లాకు చెందిన రాథోడ్ నగేష్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద రెండు ఇనుప రాడ్లు ఉండడంతో అనుమానం వచ్చి విచారించగా అతడితో పాటు మరో నలుగురు సంగారెడ్డి జిల్లాకు చెందిన జాదవ్ బలరాం, జాదవ్ పుండలిక్, జాదవ్ జైరామ్, కామారెడ్డి జిల్లాకు చెందిన కేతవత్ రాజుతో కలిసి దొంగతనాలు చేసినట్లు తేలింది. వీరిలో రాథోడ్ నగేష్, జాదవ్ బలరాం, జాదవ్ పుండలిక్, కేతవత్ రాజులను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరొక నిందితుడు జాదవ్ జైరామ్ కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు. సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాలతో పాటు మిగతా జిల్లాల్లో కూడా వీరిపై కేసులు నమోదైనట్లు సీపీ తెలిపారు. పోలీసుల అదుపులో ఉన్న నలుగురిని సిద్దిపేట కోర్టులో హాజరు పరిచినట్లు సీపీ తెలిపారు. నిందితుల నుంచి 45 తులాల బంగారు ఆభరణాలు, 50 తులాల వెండి ఆభరణాలు, నాలుగు ద్విచక్ర వాహనాలు, 2 ఇనుప రాడ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.





వివరాలు వెల్లడిస్తున్న సిద్దిపేట సీపీ బి.అనురాధ, నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తు

ముగ్గురు నిందితులపై నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్లు

సిద్దిపేట జిల్లాలో దొరికిన ఐదుగురు నిందితుల్లో ఏ-వన్ రాథోడ్ నాగేష్‌పై ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, నిజామాబాద్, సంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 48 నాన్ వెలబుల్ వారెంట్లు ఉన్నాయని, ఏ-2 జాదవ్ బలరాంపై రాజన్న సిరిసిల్ల, సైబరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, సంగారెడ్డి జిల్లాల్లో 40 నాన్ బెయిలబుల్ వారెంట్లు, ఏ-3 జాదవ్ పుండలిక్‌పై సైబరాబాద్, జగిత్యాల జిల్లాల్లో 15 వారెంట్లు సంబంధిత న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయని సీపీ అనురాధ తెలిపారు.

పరస్పరం సహకరించుకుందాం

● బీదర్‌లో తెలంగాణ, కర్ణాటక పోలీసుల సమావేశం


సమావేశంలో కర్ణాటక, జహీరాబాద్, నారాయణఖేడ్ పోలీసు అధికారులు

జహీరాబాద్, ఏప్రిల్ 20: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరం ఉందని బీదర్ జిల్లా అదనపు ఎస్పీ మహేష్ మేగవన్న పేర్కొన్నారు. శనివారం బీదర్ పట్టణంలో జహీరాబాద్, నారాయణఖేడ్ డివిజన్ పోలీసులు, బీదర్ పోలీసుల సమక్షంలో బార్డర్ క్రైం మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 7న కర్ణాటకలో, మే13న తెలంగాణలో లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో పరస్పరంగా తనిఖీలు నిర్వహిస్తూ ఎన్నికలు ప్రశాంతగా కొనసాగేలా కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అక్రమ మద్యం రవాణా, నగదు రవాణాలపై నిరంతరం నిఘా పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కర్ణాటక-తెలంగాణలోని అంతర్గత రహదారుల్లో తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. పరస్పర సహకారంతోనే నేరాలను అరికట్టవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. సమావేశంలో బీదర్, జహీరాబాద్, నారాయణఖేడ్ డీఎస్పీలు హన్మంతప్పపాటిల్, రామ్మోహనరెడ్డి, వెంకట్‌రెడ్డి, సీఐలు రాజబోయిన రవి. నయీమొద్దీన్, ఎస్ఐలు రామానాయుడు, సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర పాలనను అడ్డుకునేందుకే ఒక్కటయ్యారు

● కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై రఘునందన్‌రావు ధ్వజం

హత్నూర, ఏప్రిల్ 20: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అందజేస్తున్న సుస్థిర పాలనను అడ్డుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకటయ్యాయని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ధ్వజమెత్తారు. హత్నూర మండల పరిధిలోని చందాపూర్, బోర్పట్ల, రెడ్డిఖానాపూర్, కాసాల, దౌల్తాబాద్, హత్నూర, చీక్‌మద్దూర్, సిరిపుర గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గత పదేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలిందన్నారు. అదేవిధంగా రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ఓడించి తగిన బుద్ధి చెప్పాలన్నారు. మోదీప్రభుత్వానికి మద్దతు తెలిపాలన్నారు. దౌల్తాబాద్, కాసాల గ్రామాల్లో టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరినవారిలో వెల్దుర్తి మండలంలోని మంగళపర్తి ఎంపీటీసీ ఆడివయ్య తదితరులున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్‌యాదవ్, ఓబీసీ మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బిట్ల మహేష్, నర్సాపూర్ అసెంబ్లీ కో కన్వీనర్ సతీష్ యాదవ్, మండల అధ్యక్షుడు నాగప్రభుగౌడ్, ప్రధాన కార్యదర్శి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.


హత్నూర: దౌల్తాబాద్‌లో వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరిన నాయకులకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న రఘునందన్‌రావు

పలు మండలాల్లో ఇంటింటి ప్రచారాలు

● **చేగుంట:** బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్ ఆధ్వర్యంలో శనివారం చేగుంట మండలం బి కొండాపూర్, బోనాల, గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో దుబ్బాక అసెంబ్లీ కన్వీనర్ ఎస్ఎన్ చారి, బీజేపీ నాయకులు మంద బాల్‌చందర్, పాండు, నాగభూషణం, సిద్ది రాములు, హరిశంకర్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **అల్లాదుర్గం:** మండలంలోని కాయిదంపల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు యాదగిరి, బీజేపీ నాయకులుతో కలసి బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కాళ్ల రాములు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు గౌడ్, నీలి రమేష్, మల్లేశం తదితరులు ఉన్నారు.

● **మాసాయిపేట:** మండల కేంద్రంలోని మాసాయిపేట వడ్డెర కాలనీ ముదిరాజ్ బస్తీ ప్రధాన కూడలితో పాటు బస్తీలలో శనివారం బీజేపీ నాయకులు శనివారం ప్రచారాన్ని నిర్వహించారు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాపన్న గారి వేణు రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు

● **పెద్దశంకరంపేట:** పెద్దశంకరంపేట మండలకేంద్రంతో పాటు మండలంలోని కమలాపూర్, ఇస్రానాయక్ తండా తదితర గ్రామాల్లో శనివారం మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీతోనే సుస్థిర దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు శ్రావణ్‌కుమార్, రాజు, కిషన్, ఎర్ర శ్రీహరి, బొగుడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం.. రూ.2లక్షల ఆస్తి నష్టం


తుజాల్‌పూర్‌లో దగ్ధమైన గుడిసె

నర్సాపూర్, ఏప్రిల్ 20: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన చాకలి నర్సింహులుకు చెందిన పూరిగుడిసె షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమై సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. బాధితుడు చాకలి నర్సింహులు వివరాల ప్రకారం.. శనివారం ఉదయం గుడిసెలో షార్టుసర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. ఇంట్లో వెంటనే బయటకు రాగా గుడిసె పూర్తిగా దగ్ధమైంది. దీంతో గుడిసెల్లో సరకులు, ఇతర సామగ్రితో పాటు సర్వస్వం అగ్నికి ఆహుతి కాగా బాధిత కుటుంబీకులు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు వి.మల్లేశ్ గౌడ్, అర్వింద్‌గౌడ్, కుమార్‌లు శనివార బాధిత కుటుంబాన్ని పరామర్శించి తమవంతుగా ఆర్థిక సాయాన్ని అందజేశారు.

విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధం

నారాయణఖేడ్, ఏప్రిల్ 20: ట్రాక్టర్ ట్రాలీలో పశుగ్రాసాన్ని తరలిస్తుండగా ప్రమాదవశాత్తు పైన విద్యుత్ తీగలు తగలడంతో మంటలు అంటుకొని పూర్తిగా దగ్ధమైంది. స్వల్ప గాయాలతో డ్రైవర్ ప్రమాదం నుంచి బయటపడగా, త్రుటి ప్రమాదం తప్పినట్టయ్యింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ర్యాకల్ నుంచి చాప్టా.కె మార్గంలో శనివారం పశుగ్రాసంతో వెళ్తున్న ట్రాక్టర్‌కు పైనున్న విద్యుత్ తీగలు తగలడంతో పశుగ్రాసానికి మంటలు అంటుకున్నాయి. స్థానికులు ఖేడ్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా, సిబ్బంది వాహనంతో వచ్చి మంటలను ఆర్పి వేశారు. అప్పటికే పశుగ్రాసం దగ్ధమైంది. ట్రాక్టర్ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని స్థానికులు తెలిపారు.

అమర్‌నాథ్ యాత్రికులకు ఫిట్‌నెస్ ధ్రువీకరణ

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 20: అమర్‌నాథ్ యాత్రకు వెళ్తే యాత్రికులకు సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పనిదినాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే యాత్రికులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం ఆస్పత్రిలోని ఆర్ఎంవో గదిలో సంప్రదించాలని కోరారు.

పాలిసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 20: పాలిసెట్‌కు ఈ నెల 22 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సంగారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు మే 24న అర్హత పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. పరీక్ష రుసుము ఎస్సీ, ఎస్టీలకు రూ.250, ఇతరులకు రూ.500 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

టీజీ సెట్ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు

కల్హేర్, ఏప్రిల్ 20: మండల కేంద్రమైన కల్హేర్‌లోని శ్రీసాయి విద్యాలయం, నిజాంపేట మండలం బాచేపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన 5వ తరగతి ప్రవేశ పరీక్ష (టీజీసెట్) ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ పండరి గౌడ్, రజిత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కల్హేర్‌లోని శ్రీసాయి విద్యాలయం నుంచి 52 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయగా 40 మంది, బాచేపల్లిలో 31మంది పరీక్షలు రాయగా 28 మంది విద్యార్థులు మొదటి దశలో బీసీ, సోషల్, ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలకు ఎంపికైనట్లు తెలిపారు.

ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా అయ్యప్ప స్వామి

మునిపల్లి, ఏప్రిల్ 20: బీజేపీ ఓబీసీ మోర్చా సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని మల్లికార్జున్‌పల్లి గ్రామానికి చెందిన అయ్యప్పస్వామి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు ఉపేందర్, ప్రధాన కార్యదర్శి రామ్‌రఘుకు కృతజ్ఞతలు తెలిపారు.

విమర్శలు మాని ప్రజాశ్రేయస్సుకు కృషి చేయండి


జహీరాబాద్‌లో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు దేశెట్టిపాటిల్

జహీరాబాద్, ఏప్రిల్ 20: ఎమ్మెల్యే మదన్‌మోహన్ విమర్శలు మాని ప్రజాశ్రేయస్సుకోసం పనిచేయాలని జేకే చారిటబుల్ ట్రస్టు అధినేత, బీజేపీ రాష్ట్ర నాయకుడు దేశెట్టిపాటిల్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... తన వ్యాపారాలను కాపాడుకోవడానికి పార్టీలు మారిన చరిత్ర ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దక్కిందన్నారు. జహీరాబాద్ అభివృద్ధికి గత పదేళ్లకాలంగా బీబీపాటిల్ చేసిన కృషి అమోఘమని ఆయన కొనియాడారు. బీబీపాటిల్ గెలుపు కోసం అందరం కలిసికట్టుగా కృషిచేద్దామని ఆయన బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ నాయకులు మడుపతి వీరేశ్, చంద్రశేఖర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

● **నారాయణఖేడ్/కల్హేర్:** బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ పేర్కొన్నారు. శనివారం కల్హేర్ మండల పరిధిలోని బీబీపేట్‌లో, నారాయణఖేడ్‌లో బూత్ నెం.165 నుంచి 174 బీజేపీ బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పదేళ్లపాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలని సూచించారు. ఆయా సమావేశాల్లో నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్ యాదవ్, టౌన్ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, టౌన్‌ప్రధాన కార్యదర్శి సదనాకర్, వెంకట్‌రెడ్డి, బి.సతీష్‌కుమార్, కల్హేర్ మండల బీజేపీ అధ్యక్షుడు ఎన్నం అనిల్‌రెడ్డి, స్టేట్ కౌన్సిల్ మాజీ మెంబర్ సంగమేశ్వర్‌రావ్, కోఆర్డినేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సార్వత్రిక పరీక్షలు

● జిల్లా వ్యాప్తంగా 5 కేంద్రాల ఏర్పాటు

● సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 20: ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే సార్వత్రిక పది, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరిగే పరీక్షలకు మెదక్ జిల్లా వ్యాప్తంగా మెదక్‌లో 2, నర్సాపూర్‌లో 2, తూప్రాన్‌లో ఒకటి మొత్తం 5 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలకు 680మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ఒక సిటింగ్ స్క్వాడ్ నియమించామన్నారు. సమావేశంలో ఇంటర్ జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ, డీఈవో రాధాకిషన్, పరీక్ష సహాయ కమిషనర్ రామేశ్వర ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం వినూత్న నిరసన


రోడ్డుకు అడ్డంగా ముళ్లపొదలు వేసి నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఝరాసంగం, ఏప్రిల్ 20: మండల పరిధిలోని మాచ్నూర్ గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తడంతో ఇబ్బందులు పడుతున్నామంటూ శనివారం గ్రామానికి చెందిన ఓ యువకుడు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశాడు. గ్రామానికి చెందిన అశోక్ అనే వ్యక్తి ఝరాసంగం వెళ్లే రోడ్డుపై ముళ్లపొదలు, ఖాళీబిందెలు ఉంచి నిరసన వ్యక్తం చేశాడు. సుమారు గంటపాటు రోడ్డుపై ఆందోళన చేపట్టడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ సమాచారమందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత యువకుడితో మాట్లాడి సర్దిచెప్పారు. ఇంటిపక్కనే తాగునీటిట్యాంకు ఉన్నా, తమకు మాత్రం నీరురావడం లేదని ఆ యువకుడు అధికారులతో వాపోయాడు. తన సమస్యను పరిష్కరించే వరకు రోడ్డుపై నుంచి కదలబోనంటూ భీష్మించుకుని కూర్చున్నాడు. పక్షం రోజులుగా నీళ్ల లేకపోతే పరిస్థితి ఎలా ఉంటుందని ఆ యువకుడు పోలీసులతో ఆవేదన వ్యక్తంచేశాడు. మరుసటి రోజు సమస్యను పరిష్కరించే విధంగా కృషిచేస్తామని బీజేపీ నాయకుడు మల్లికార్జున్‌పాటిల్, పోలీసులు సర్ది చెప్పడంతో ఆ యువకుడు శాంతించాడు.

మోసంతో పట్టా మార్పిడి చేయించుకున్నాడు

● చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు బాధితురాలి వినతి

నారాయణఖేడ్, ఏప్రిల్ 20: మాయమాటలు చెప్పి భూమిని తన పేరిట మార్చుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని నిజాంపేటకు చెందిన కుమ్మరి లచ్చమ్మ శనివారం నారాయణఖేడ్ ఆర్డీవో, నిజాంపేట తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిజాంపేట శివారులోని సర్వే నెం.485అ/1 లో తన పేరిట ఒక ఎకరా 23 గుంటల భూమి ఉందని తెలిపింది. తమ సమీప బంధువు కొత్త పాసు పుస్తకం ఇప్పిస్తానని నమ్మబలికి, అధికారులతో కుమ్మక్కై ఆ భూమిని తన పేరిట మార్చుకున్నాడని ఆరోపించింది. తాము సదరు భూమిని కొనుగోలు చేశామని, ఆర్‌వోఆర్‌లో సైతం నా పేరే ఉందని బాధితురాలు తెలిపింది. మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఆమె వినతిపత్రంలో కోరింది.

వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరికలు


వెల్దుర్తి: కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న దృశ్యం

నారాయణఖేడ్, ఏప్రిల్ 20: ఖేడ్‌లో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్, ఉమ్మడి మెదక్ జిల్లా జడ్పీప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్‌ల సమక్షంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ నుంచి కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఖేడ్ మండలం శేరితండా మాజీసర్పంచు సంకిబాయి, ఉప సర్పంచు మోతీరాంతో పాటు ఎనిమిది మంది మాజీ వార్డు సభ్యులు వారి అనుచరులతో కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే పెద్దశంకరంపేట మండల బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్‌సలీం, పట్టణ శాఖ అధ్యక్షుడు మహ్మద్‌యాదుల్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. శ్రీనివాస్, నగేష్ షెట్కార్ వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

● **గుమ్మడిదల:** పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి నీలం మధు, కాటా శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో కొత్తపల్లి గ్రామం నుంచి అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో దాదాపు 20 మంది పైగా యువత నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాటా శ్రీనివాస్ గౌడ్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుట్ట నర్సింగ్ రావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు మద్దివీరారెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

● **వెల్దుర్తి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మనేపల్లి గ్రామానికి చెందిన పలువురు వారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, పోతిరెడ్డి, శంకర్‌గౌడ్, మైసగౌడ్, శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు రాకుండా చూడండి


పెద్దచెల్మెడలో పీఏసీఎస్ సొసైటీని పరిశీలిస్తున్న డీఏవో

మునిపల్లి , ఏప్రిల్ 20: ఎరువులు, విత్తనాల విషయంలో రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని సంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి నర్సింగ్‌రావు ఫర్టిలైజర్ షాపుల డీలర్లకు సూచించారు. శనివారం మండలంలోని బుదేరా సంగమేశ్వర, పెద్ద చెల్మెడలోని పీఏసీఎస్ సహకార సొసైటీ లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మంచి విత్తనాలు, ఎరువులు అందించాలని, లేకుంటే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఏవో శివకుమార్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అధికారులు

చేగుంట, ఏప్రిల్ 20: చేగుంట మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం చేగుంట తహసీల్దార్ గియ వున్నీసా బేగం, అధికారులతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ శనివారం ఉదయం కురిసిన వర్షానికి మండలంలో ఎక్కడా ధాన్యం తడిసి పోలేదన్నారు. ధాన్యం బస్తాలు కొద్దిగా తడిసినప్పటికీ మండలంలో ఎక్కడ కూడా భారీగా నష్టం జరగలేదని ఆమె తెలిపారు.

ఖమ్మంపల్లిలో 'మా బడికి రండి'

మునిపల్లి , ఏప్రిల్ 20: మా బడికి రండి .. మా బడిలో చేరండి అనే కార్యక్రమంలో భాగంగా శనివారం ఖమ్మంపల్లి పాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖమ్రొద్దీన్ మాట్లాడుతూ వేసవి సెలవుల కంటే ముందే ఐదేళ్లు నిండిన ప్రతి విద్యార్థిని ప్రైవేట్ పాఠశాలల్లో కాకుండా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చడం వల్ల ప్రయోజనాలను వారికి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినయ్ కుమార్, గోపాల్, ప్రీతి, పీటీఎస్ యాదయ్య పాల్గొన్నారు.

సీఎం సభకు భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు


గుమ్మడిదల టోల్ ప్లాజా వద్ద జెండా ఊపి వాహనాల ర్యాలీని ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ

గుమ్మడిదల/జిన్నారం/నర్సాపూర్/కొల్చారం/చిన్నశంకరంపేట/ చేగుంట, ఏప్రిల్ 20: మెదక్ పార్లమెంట్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నీలం మధుకు మద్దతుగా శనివారం మెదక్ రాందాస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లాయి పటాన్ చెరు అసెంబ్లీ నియోజకవర్గం గుమ్మడిదల టోల గేట్ నుంచి మెదక్ జిల్లా కేంద్రం వరకు పటాన్‌చెరు నియోజికవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఎంపీ అభ్యర్థి నీలం మధుతో బయలుదేరిన అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి, పార్లమెంట్ ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ గుమ్మడిదలకు చేరుకొని టోల్‌ప్లాజా సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ వాహనాల ర్యాలీని మంత్రి సురేఖ జెండా ఊపి ప్రారంభించారు. జిన్నారం మండలం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు ఎంపీపీ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డి, మున్సిపల్ శాఖ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. నర్సాపూర్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆవులరాజిరెడ్డి, రాష్ట్ర మహిళా నాయకురాలు సుహాసినిరెడ్డి, నియోజకవర్గ మహిళ ఇన్‌చార్జి సుజాత, నాయకులు తదితరులు నర్సాపూర్ పట్టణం సబ్‌స్టేషన్ వద్ద మంత్రి కొండాసురేఖ వచ్చే వరకు వేచి ఉండి ఆమె వచ్చాక ఘనంగా స్వాగతం పలికి ఆమెతో పాటు మెదక్‌కు తరలివెళ్లారు. కొల్చారం మండలంలోని రాంపూర్ గ్రామం వద్దకు నీలం మధు కాన్వాయ్ చేరుకోగానే జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ వీర తిలకం దిద్దగా, కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులగారి మల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. చిన్నశంకరంపేట మండలం నుంచి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సాన సత్యనారాయణ ఆధ్వర్యంలో సీఎం సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. చేగుంట, నార్సింగి మండలాల నుంచి శనివారం కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా మెదక్ తరలి వెళ్ళారు. చేగుంట, నార్సింగి, మండలాల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, ఆకుల శ్రీనివాస్ గౌడ్ .ఆధ్వర్యంలో భారీగా నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

హత్నూర, ఏప్రిల్ 20: హత్నూర మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఐకేపీ డీపీఎం జయశ్రీ శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దౌల్తాబాద్, నాగులదేవులపల్లి, దౌలాపూర్, హత్నూర గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం దేవేందర్, సీసీలు మహేష్, కల్పన, పద్మావేణి, గ్రామాఖ్య సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

బొల్లారంలో ఉచిత న్యాయసేవ సలహా కేంద్రం ప్రారంభం

జిన్నారం, ఏప్రిల్ 20: బొల్లారం మున్సిపాలిటీలో ఉచిత న్యాయ సేవా సలహా కేంద్రాన్ని ప్రారంభించారు. శనివారం బొల్లారం బీరప్ప బస్తిలో జిల్లా లీగల్ సర్వీసెల్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత సలహా కేంద్రాన్ని న్యాయవాది గౌతమి ప్రారంభించారు. పేదలు, కుటుంబ తదితర న్యాయ సహాయం, సలహాలు పొందేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ప్రతి శనివారం ఈ కేంద్రం యొక్క సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎల్‌వీ నిర్వాహకురాలు శారద, మహిళలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పూర్వ ప్రాథమిక విద్య

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 20: అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య అందించనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి తెలిపారు. సంగారెడ్డిలోని రాజంపేట అంగన్‌వాడీ కేంద్రం వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి మాట్లాడుతూ ఆట పాటల ద్వారా పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యనందిస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సునీత, చిన్నారుల తల్లిదండ్రులు ఉన్నారు.

సీతారాములకు గరుడవాహన సేవ


జిన్నారంలో సీతారాముల విగ్రహాలకు గరుడ వాహనసేవలో ఊరేగిస్తున్న భక్తులు

జిన్నారం, ఏప్రిల్ 20: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా జిన్నారంలో ఘనంగా గరుడవాహన సేవను నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాల చివరి రోజైన శనివారం జిన్నారంలో శ్రీసీతారాములను గరుడవాహన సేవలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కోదండరామాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో ఉత్సవాల ముగింపు

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 20: మండలకేంద్రంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. శనివారం ఉదయం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో సీతారాముల విగ్రహాలను భాజాభజంత్రీలతో పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు స్వామి వారికి మంగళహారతులతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ బాధ్యులురాగం సిద్దేశ్వర్, శ్రీనివాస్, ఆలయ పూజారులు రామాచారి, రాకేష్‌చారి, భక్తులుపాల్గొన్నారు.

గవ్వలపల్లిలో వైభవంగా రథోత్సవం

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 20: మండలంలోని గవ్వలపల్లి గ్రామంలో శనివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకల సందర్భంగా గ్రామంలోని మూడు రోజుల పాటు రామలింగేశ్వరస్వామి జాతర ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం ఆలయంలో వేకువజాము నుంచే విశేష పూజలు, అర్చనలు జరిగాయి. రథాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి, ఉత్సవ విగ్రహాలను డప్పు సన్నాయిల మధ్య ఊరేగించారు.

తూప్రాన్‌లో బ్రహ్మోత్సవాలు

తూప్రాన్, ఏప్రిల్ 20: తూప్రాన్ పట్టణ శివారులోని పురాతన శ్రీరామాలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం గరుడ వాహన సేవ, గోపాలకాలువలు నిర్వహించారు. రాత్రి శ్రీసీతారామచంద్రస్వామికి గజవాహన సేవ నిర్వహించారు.

పొతంశెట్టిపల్లిలో పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


పెద్దమ్మ ఆలయం వద్ద పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న మాధవానంద సరస్వతి స్వామి

కొల్చారం, ఏప్రిల్ 20: మండలంలోని పోతంశెట్టిపల్లిలో ముదిరాజ్‌సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాలు శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూల విగ్రహంతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణంలో గణపతి హోమం, జలాధివాసం తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నర్సింహులు, గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తూప్రాన్‌లో నేటి నుంచి హనుమాన్ జయంతి

తూప్రాన్, ఏప్రిల్ 20: తూప్రాన్ పెద్దచెరువు కట్టపై వెలసిన శ్రీవీరాంజనేయస్వామి ఆలయం వద్ద ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు హన్‌మాన్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకుడు శలాక ఆత్రేయ శర్మ తెలిపారు. 21న గణపతిపూజ, గురుచరిత్ర పారాయణం, 22న గణపతి, నవగ్రహ హోమాలు, 23న హన్‌మాన్ జయంతి ప్రత్యేక కార్యక్రమాలుంటాయన్నారు.

చిన్న పిల్లలకు దారి చూపేది అంగన్‌వాడీ కేంద్రాలే

మునిపల్లి, ఏప్రిల్ 20: చిన్న పిల్లలకు విద్యతో పాటు ఆట, పాటలు నేర్పించి దారి చూపేది అంగన్‌వాడీ కేంద్రాలేనని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైలజ పేర్కొన్నారు. శనివారం మండలంలోని బుసారెడ్డిపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో యాన్యువల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమణకుమార్, అజయ్, మనోహర్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు నాగరాణి, శివకళ, పిల్లల తల్లిదండ్రులు, యూత్ లీడర్లు పాల్గొన్నారు.

డబ్బులు ఇస్తామని చేతులెత్తేశారు

● దౌల్తాబాద్‌లో ఎస్సీల ఆగ్రహం

హత్నూర, ఏప్రిల్ 20: మండలంలోని దౌల్తాబాద్‌లో శనివారం బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అయితే ఎన్నికల ప్రచారానికి జనం ఉండాలన్న ఉద్దేశంతో ఆ గ్రామంలోని ఎస్సీలను ఇళ్ల వద్దే ఉండాలని, ప్రచారం ముగిసిన తర్వాత ఒక్కొక్కరికి రూ.500 చొప్పున చెల్లిస్తామని స్థానిక బీజేపీ నాయకులు ఎస్సీలకు తెలిపినట్టు వారు పంపిన వీడియో వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నది. గత ఎన్నికల సమయంలో కూడా ఇతర పార్టీల వారు మందు పంపిణీ చేస్తే.. బీజేపీ వాళ్లు మాత్రం పంచకుండా అమ్ముకున్నారని ఆరోపించారు. ఎస్సీలంటే అంత చులకనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకముందు బీజేపీ వాళ్లు మా గల్లీలోకి ప్రచారానికి వస్తే చెప్పుతో కొడతామని వారు హెచ్చరించారు.

బస్సులు ఆపడం లేదని ఫిర్యాదు

అల్లాదుర్గం, ఏప్రిల్ 20: అల్లాదుర్గం మండల కేంద్రంలో ఆర్టీసీ బస్సులు ఆపడం లేదని ఆరోపిస్తూ ప్రయాణికులు సంగారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. చాలీ చాలని విధంగా బస్సులను ఏర్పాటు చేయడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కొరతతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు ఆర్టీసీ డ్రైవర్లు ప్రధాన స్టేజీల వద్దనే బస్సులు నిలపకపోవడంతో ప్రయాణికులకు మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నారంటు డీఎంకు విన్నవించారు. మండలంలోని ముస్లాపూర్‌లోను ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపడం లేదని, ఈ రహదారిలో ఆర్డినరీ బస్సులు ఒకటి, రెండు బస్సులను ఏర్పాటు చేసి చేతులు దులుపుకోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామస్థులు శనివారం డీఎంకు విన్నవించారు. ఇందుకు స్పందించిన డీఎం ప్రతీ బస్ స్టేజీ వద్ద బస్సులు ఆపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.